ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



మంచిర్యాల
జిల్లా వార్తలు

5

సోమవారం 15 జూలై 2024

రైతు నేస్తం..

కృషి విజ్ఞాన కేంద్రం



ఆరేండ్లుగా రెండు జిల్లాల్లో రైతులకు సేవలు

శిక్షణ తరగతులు, అవగాహన సదస్సులు

జాతీయ, రాష్ట్రస్థాయిలో అవార్డులు అందుకున్న రైతులు, శాస్త్రవేత్తలు

బెల్లంపల్లి, జూలై 14: రైతులకు మెరుగైన సేవలు అందించాలనే సంకల్పంతో ఏర్పాటైన కృషి విజ్ఞాన కేంద్రం ఆధునిక సాంకేతికతను కర్షకులకు చేరువ చేయడంతోపాటు వివిధ అంశాల్లో శిక్షణ ఇస్తోంది. ఆధునిక సేద్యంతో అధిక దిగుబడులు సాధించేందుకు విజ్ఞాన కేంద్రం కృషి చేస్తోంది. బెల్లంపల్లిలో కృషి విజ్ఞాన కేంద్రం ప్రారంభమై 6 ఏండ్లు పూర్తి చేసుకుంది. కుమరంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లోని రైతులకు వివిధ పంటలపై శిక్షణ తరగతులు, ఆధునిక వ్యవసాయ రంగంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది.

కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా మెళకువలు నేర్చుకున్న రైతులు జాతీయ స్థాయిలో అవార్డులు అందుకున్నారు. అలాగే పలువురు శాస్త్ర వేత్తలు కూడా అవార్డులు, ప్రశంసా పత్రాలు అందుకున్నారు.

50 ఎకరాల్లో కేవీకే ఏర్పాటు

బెల్లంపల్లిలో 2018లో కృషి విజ్ఞాన కేంద్రాన్ని నెలకొల్పారు. 50 ఎకరాల విస్తీర్ణంతో ఏర్పాటు చేశారు. రూ.2 కోట్ల వ్యయంతో కృషి విజ్ఞాన కేంద్రం భవనంతో పాటు రూ.85 లక్షలతో రైతు వసతి గృహాన్ని నెలకొల్పారు. ఐసీఏఆర్ (భారత వ్యవసాయ పరిశోధన మండలి) ప్రొఫెసర్ జయశంకర్ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో మంచిర్యాల, కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాల రైతులకు కృషి విజ్ఞాన కేంద్రం విశేష సేవలందిస్తోంది.

ఈ కేంద్రం ద్వారా రైతులకు ఆధునిక పద్ధతులపై శిక్షణ, వాతావరణ సమాచారం, పంటల యాజమాన్య పద్ధతులు, చీడ, పీడల నివారణ, నూతన వంగడాలను అందించడం వంటివి శాస్త్రవేత్తలు చేస్తున్నారు. అదే విధంగా సంప్రదాయ సాగుతో నష్టాలు ఎదుర్కొంటున్న రైతులకు ఆధునిక సేద్యంతో అధిక దిగుబడులు సాధించేందుకు శాస్త్ర వేత్తలు కృషి చేస్తున్నారు. ప్రదర్శన క్షేత్రాలను ఏర్పాటు చేసి కొత్త పరిశోధనలను రైతులకు చేరువ చేస్తున్నారు. శిక్షణ తరగతుల్లో సాంకేతిక అభివృద్ధితో రైతులు ముందుకు నడవడానికి కృషి చేస్తున్నారు. సేంద్రియ వ్యవసాయం, జీవన ఎరువులు, మేలు జాతి పశువులు, వంగడాల ఏర్పాటు, చేప పిల్లల పెంపకం, పూల సాగు, తీగజాతి కూరగాయల పెంపకం కోసం శాశ్వత పందిల్ల ఏర్పాటు, రైతుల భూమిలో నత్రజని శాతం ఎంత ఉందని పరిశోధన చేస్తున్నారు.

సేంద్రియ సాగు పెంచేలా....

రెండు జిల్లాల్లో సేంద్రియ సాగు పెంచేందుకు శాస్త్రవేత్తలు రైతులకు తరుచూ అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. సేంద్రియ విధానంలో ప్రయోగ పూర్వకంగా పలు పంటలను సాగు చేస్తున్నారు. వీటి ఫలితాలను రైతులకు అందిస్తున్నారు. వ్యవసాయ పని అనుభవ శిక్షణలో భాగంగా ఇప్పటివరకు రెండు జిల్లాల్లో వందలాది మంది రైతులను సేంద్రియ సాగు దిశగా మళ్లించారు. కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో రెండు జిల్లాల్లో శాస్త్ర వేత్తలు దత్తత గ్రామాలను ఏర్పాటు చేసుకుని రైతులకు సాగులో మెళకువలను నేర్పిస్తున్నారు. సాగుపై ప్రయోగాలు, పంటల సంరక్షణ, ఉద్యాన విభాగం, వ్యవసాయ విస్తరణ, గృహ విజ్ఞాన విభాగం, పశుపోషణ తదితర విభాగాల్లో ఏడుగురు శాస్త్రవేత్తలు విధులు నిర్వహిస్తున్నారు.

యేటా వందకు పైగా శిబిరాలను నిర్వహిస్తూ రైతులకు అండగా ఉంటున్నారు. సేంద్రియ సాగులో భాగంగా బీజామృతం, బ్రహ్మాస్త్రం, నీమాస్త్రం, ఘన జీవామృతం, వర్మీకంపోస్టు, పచ్చిరొట్ట సాగు తయారీని నేర్పించేందుకు శిబిరాలను నిర్వహిస్తున్నారు. సస్యరక్షణ విభాగం ఆధ్వర్యంలో దుక్కులు దున్నడం మొదలు పంటలు చేతికి వచ్చే వరకు అవగాహన కల్పిస్తున్నారు. చిరుధాన్యాల పంటల సాగును ప్రోత్స హిస్తున్నారు. రైతులకు సేవలందించినందుకుగాను శాస్త్రవేత్తలు జాతీయ, రాష్ట్ర జిల్లా స్థాయిలో 38 సార్లు అవార్డులు అందుకున్నారు.

కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా ఎంతో నేర్చుకున్నా

సుగుణ, మహిళ రైతు, నాగసముద్రం



సేంద్రియ పద్ధతిలో ఐదెకరాల్లో వ్యవసాయం చేస్తున్నా. ఇందులో బ్లాక్‌రైస్, రెడ్‌రైస్, మ్యాజిక్ రైస్ వంటివి సాగు చేస్తున్నా. అన్ని ఖర్చులు పోను ఎకరానికి లక్ష రూపాయలకు పైగా మిగులుతుంది. కృషి విజ్ఞన కేంద్రం ద్వారా సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేయడం నేర్చుకున్న. శాస్త్రవేత్తలు చెప్పిన మెలకువలు ఎంతో ఉపయోగపడ్డాయి. 18 దేశీయ వరి వంగడాలతో సాగు చేస్తున్నాను. జాతీయ స్థాయిలో ఉత్తమ మహిళ రైతు అవార్డును అందుకోవడం చాలా సంతోషాన్ని ఇచ్చింది.

అవగాహన సదస్సులు ఉపయోగపడ్డాయి

వి.శంకర్, రెబ్బెన, కొమురభీం ఆసిఫాబాద్‌జిల్లా



కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుల ద్వారా ఎంతో నేర్చుకున్నా. అధిక సాంద్రత పద్ధతి ద్వారా నాలుగు ఎకరాల్లో పత్తి సాగు చేశా. సాధారణ పద్ధతి కంటే అధిక దిగుబడి వచ్చింది. ఎకరానికి రూ.20 వేలు అదనంగా లాభం వచ్చింది. కొందరు రైతులు అవగాహన లేక విత్తన భారం పడుతుందని అధిక సాంద్రత పత్తి వైపు మొగ్గు చూపడం లేదు. శాస్త్రవేత్తలు అందించిన సూచనల మేరకు పంటలు సాగు చేసినందుకు ఉత్తమ రైతు అవార్డు రావడం ఆనందంగా ఉంది.

సద్వినియోగం చేసుకోవాలి

డాక్టర్ కోట శివకృష్ణ, కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటర్



కృషి విజ్ఞాన కేంద్రాన్ని రెండు రైతులు సద్వినియోగం చేసుకోవాలి. కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, సేంద్రియ సాగు పై శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటున్నాం. వారి సందేహాలను తీర్చేందుకు గ్రామాల్లో పర్యటిస్తూ పంటలను పరిశీలిస్తూ సలహాలు, సూచనలు అందిస్తున్నాం. రైతులు వ్యవసాయ రంగంలో నష్ట పోకుండా అధిక దిగుబడులు సాధించే దిశగా కృషి చేస్తున్నాం.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

జైపూర్, జూలై 14: మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 1988-89 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు 36 ఏండ్ల తర్వాత ఒక చోట కలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఉత్సాహంగా గడిపారు. విద్యాబోధన చేసిన గురువులు సదానందం, సుభాష్‌చంద్రబోస్, ప్రకాష్‌రావు, శంకర్, జ్ఞానలీలను సన్మానించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. పూర్వ విద్యార్థులు చిక్కాల సంపత్, బడికెల సంపత్, శ్రీనివాస్, జుమ్మిడి రాయమల్లు, వెంకట్ పాల్గొన్నారు.

గుండా మల్లేష్ సేవలు మరువలేనివి



గుండా మల్లేష్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

బెల్లంపల్లి, జూలై 14 : మాజీ ఎమ్మెల్యే, కమ్యూనిస్టు పోరాట యోధుడు గుండా మల్లేష్ 77వ జయంతిని ఆదివారం బెల్లంపల్లిలో కమ్యూనిస్టు, ప్రజా సంఘాల నాయకులు ఘనంగా నిర్వహించారు. గుండా మల్లేష్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు మాట్లాడుతూ నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేశారన్నారు. పేదల సంక్షేమానికి నిరంతరం పాటుపడ్డారన్నారు. నాయకులు వెంకటస్వామి, బొల్లం పూర్ణిమ, చిప్ప నర్సయ్య, దాగం మల్లేష్, లక్ష్మీనారాయణ, రాజమౌళి, రాజేష్, బాపు, చంద్రమాణిక్యం పాల్గొన్నారు.

నేరాల అదుపునకు ప్రత్యేక చర్యలు



మాట్లాడుతున్న సీఐలు

బెల్లంపల్లి, జూలై 14: నేరాల అదుపునకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని రూరల్ సీఐ అఫ్జలొద్దీన్, టూటౌన్ ఇన్‌స్పెక్టర్ దేవయ్యలు తెలిపారు. ఆదివారం కన్నాలబస్తీలో కార్డెన్‌సర్చ్ నిర్వహించారు. ప్రతీ ఒక్కరి ఆధార్, గుర్తింపు కార్డులను పరిశీలించారు. సరైన ధ్రువీకరణ పత్రాలు, నంబరు ప్లేట్ లేని 45 ద్విచక్ర వాహనాలు, 2 ఆటోలను సీజ్ చేశారు. వారు మాట్లాడుతూ ప్రజల రక్షణ కోసమే పోలీసులు పని చేస్తున్నారని, పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు. మూఢనమ్మకాలను నమ్మవద్దని సూచించారు. బస్తీల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎవరైనా భూకబ్జాలకు, గొడవలకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామన్నారు. ప్రతీ వాహనదారుడు వాహనానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.

21న క్వారీ జాతర



క్వారీ జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

హాజీపూర్, జూలై 14: క్వారీ జాతర ఏర్పాట్లను ఆదివారం మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు పరిశీలించారు. క్వారీ దుర్గామాత ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 21న జరిగే జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పకడ్బందీగా ఏర్పాటు చేయాలని సూచించారు. నాయకులు శ్రీనివాస్‌రావు, బాలరాజు, బాపు, నరేష్, శ్రీనివాస్, తిరుపతి, రజిత తదితరులు ఉన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

మందమర్రిరూరల్, జూలై 14 : వర్షాకాలం దృష్ట్యా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, లేకుంటే అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు సూచించారు. ఆదివారం మందమర్రి పట్టణంలోని 19వ వార్డులో పర్యటించారు. ఇంటింటికి తిరుగుతూ కూలర్లు, కుండలు, పూల కుండీలు, డ్రమ్ముల్లో నిల్వ ఉన్న నీటిని సిబ్బంది చేత పారబోయించారు. ఆయన మాట్లాడుతూ నీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెందుతాయని, దీంతో వ్యాధులు వస్తాయన్నారు. ప్రజలందరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా వార్డుల్లో పారిశుధ్య పనులను ముమ్మరంగా నిర్వహిస్తున్నామన్నారు. అధికారులు ప్రవీణ్, రాజన్న, అంజలి , రఘురాం తదితరులు పాల్గొన్నారు.

హాల్ టికెట్‌లో తప్పులు... సరి చేయాలని వినతి

జన్నారం, జూలై 14 : కలమడుగు గ్రామానికి చెందిన శ్రీపెల్లి జ్యోత్స్న డీఎస్సీలో ఎస్జీటీ పోస్టుకు దరఖాస్తు చేసుకుంది. ఈనెల 19న పరీక్ష రాయాల్సి ఉండగా హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకుంది. హాల్‌టికెట్‌లో జోత్స్న నల్గొండ జిల్లాలో పోస్టుకు దరఖాస్తు చేసుకున్నట్లు హాల్‌టికెట్ జారీ అయ్యింది. దీంతో ఆందోళనకు గురైన జోత్స్న హైద్రాబాద్‌లోని డీఎస్సీ బోర్డు కమిషనర్ లింగయ్యకు కలిసి వివరించారు. మంచిర్యాల జిల్లాలోనే పోస్టుకు దరఖాస్తు చేసుకున్నానని, వేరే జిల్లా అభ్యర్థులకు కేవలం 5 శాతం అవకాశం ఉంటుందని, సొంత జిల్లా అయిన మంచిర్యాల జిల్లాలో వచ్చే విధంగా హాల్‌టికెట్ జారీ చేయాలని కోరారు. స్పందించిన అధికారి సోమవారం లోపు సరి చేస్తామని తెలిపారని జోత్స్న పేర్కొన్నారు.

మల్లన్న విగ్రహాలకు జలాభిషేకం

జైపూర్, జూలై 14: వేలాల మల్లన్నస్వామి విగ్రహాలకు ఆదివారం గోదావరిలో జలాభిషేకం చేయించారు. అగ్నిగుండాల పూజ కార్యక్రమాల్లో భాగంగా భక్తులు భాజాభజంత్రీలతో మహిళల కోలాటాలతో పుర వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. భక్తులు, ఆలయకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆటో యూనియన్ అధ్యక్షుడిగా రాంబాబు

మందమర్రిరూరల్, జూలై 14: మందమర్రి పట్టణ ఆటో యూనియన్ ఎన్నికలు ఆదివారం జరిగాయి. అధ్యక్షుడిగా మొయ్య రాంబాబు విజయం సాధించారు. అధ్యక్ష పదవికి మొయ్య రాంబాబు, మేడి రాజులు పోటీ పడగా రాంబాబుకు 177 ఓట్లు, రాజుకు 111 ఓట్లు వచ్చాయి. దీంతో రాంబాబు విజయం సాధించాడు. ఆయనను ఆటో డ్రైవర్లు అభినందించారు.

ముగిసిన భాగవత సప్తాహం



భాస్కర శర్మను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

మంచిర్యాల అర్బన్, జూలై 14: పట్టణంలోని గోదావరి నదీతీరంలోని గౌతమేశ్వర ఆలయంలో భాగవత సప్తాహం ఆదివారం వైభవంగా ముగిసింది. సప్తాహంలో ప్రవచకులు, శతాధిక భాగవత ప్రవచనకర్త బుర్రా భాస్కర శర్మ వారం రోజులపాటు భాగవతాన్ని వివరించారు. చివరి రోజు ప్రవచకులకు భక్తులు ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. రుక్మిణీ-కృష్ణుల కల్యాణాన్ని కన్నుల పండుగలా నిర్వహించారు. నల్మాసు రాజేశం, గౌతమేశ్వర ఆలయ కమిటీ సభ్యులు గోపిగాని శ్రీదేవి, పడకంటి శ్రీనివాస్, కేశెట్టి వంశీకృష్ణ, రాజేంద్రప్రసాద్, కేశెట్టి నారాయణ, కటుకం హరీష్, పాల్గొన్నారు.

'బెల్ట్' తీసేదెప్పుడు..?

- పుట్టగొడుగుల్లా వెలుస్తున్న బెల్ట్ షాపులు
- విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు
- కిరాణా షాపుల్లో అక్రమంగా విక్రయం
- జిల్లాలో గుప్పుమంటున్న గుడుంబా
- మామూళ్ల మత్తులో జోగుతున్న అబ్కారీశాఖ



మంచిర్యాల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మద్యం ఏరులై పారుతోంది. అధికారుల అలసత్వంతో మద్యం మాఫియా గల్లీకో బెల్ట్ షాపు ఏర్పాటు చేస్తూ అందినకాడికి దండుకుంటోంది. నివాస గృహాలు, చిన్న చిన్న కిరాణా షాపుల్లోనూ కావలసినంత మద్యం దొరుకుతోంది. వైన్, బార్ షాపుల్లో సమయం ప్రకారం మద్యం లభ్యమవుతుండగా బెల్టు షాపుల్లో 24 గంటలు అందుబాటులో ఉంటోంది. ఎప్పుడంటే అప్పుడు...ఏ బ్రాండ్ అంటే ఆ బ్రాండ్ వైన్ షాపుల మాదిరి ఇళ్లలోనే లభ్యం అవుతోంది. కిలో మీటర్ల మేర దూరంలోని వైన్ షాపులకు వెళ్లాల్సిన అవసరం లేకుండానే ఐదో, పదో ఎక్కువిస్తే ఇంటి పక్కనే మద్యం దొరుకుతోంది.

వైన్ షాపులకు అనుబంధంగా

మద్యం విక్రయాలకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుండటంతో వైన్ షాపుల నిర్వాహకులు ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారు. ఒక్కో వైన్ షాపు పరిధిలో కనీసం 30 చొప్పున బెల్టు షాపులు అనుబంధంగా పని చేస్తున్నాయి. తమ టార్గెట్లు చేరుకొనేందుకు బెల్టు షాపులను ఏర్పాటు చేయిస్తూ, అక్రమంగా మద్యం అమ్మకాలు సాగించేలా వైన్‌షాపుల నిర్వా హకులే ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలున్నాయి. వైన్‌షాపుల నుంచి ఎమ్మార్పీ ధరలకు కొనుగోలు చేస్తున్న బెల్టు షాపుల నిర్వాహకులు ఒక్కో క్వార్టర్ బాటిల్‌పై రూ.20 అదనంగా వసూలు చేస్తూ అమ్మకాలు సాగిస్తున్నారు. పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా ఎక్కడ చూసినా బెల్టు షాపులు దర్శనమిస్తున్నాయి.

అక్రమంగా సిట్టింగ్‌లు ఏర్పాటు...

బెల్టు షాపుల్లో సిట్టింగ్ ఏర్పాట్లు చేస్తున్నా పట్టించుకొనేవారు లేరు. ఆహార పదార్థాలు తయారు చేస్తూ మందుబాబులకు అందజేస్తున్నారు. బెల్టు షాపుల మధ్య పోటీ పెరగడంతో కస్టమర్లను ఆకర్షించేందుకు ఇళ్లలోనే ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. బార్ అండ్ రెస్టారెంట్ల మాదిరిగా బెల్టు షాపుల్లో చికెన్, మటన్, గుడ్లు, ఆమ్లేట్, తదితర ఆహార పదార్థాలను వండి అందజేస్తున్నారు.

నిద్రావస్థలో అబ్కారీశాఖ...

విచ్చలవిడిగా బెల్టు షాపుల్లో మద్యం విక్రయాలు కొనసాగుతున్నా అబ్కారీశాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. అడ్డూ అదుపు లేకుండా అక్రమంగా మద్యం విక్రయాలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. అధికారుల నిర్లిప్తతతో మద్యం కల్తీ కూడా జరుగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా బెల్టు షాపుల్లో మద్యం కల్తీ విపరీతంగా జరుగుతున్నట్లు ఆరోపణలున్నాయి. కల్తీ మద్యం కారణంగా ప్రజలు అనారోగ్యాల బారిన పడే ప్రమాదం ఉంది. అయినా అధికారులు పట్టించుకున్న పాపాన పోవడం లేదు. వైన్ షాపులు, బెల్టు షాపుల నుంచి మామూళ్లు అందుకుంటున్న అబ్కారీశాఖ అధికారులు మద్యం మత్తులో జోగుతున్నారనే బహిరంగ ప్రచారం జరుగుతోంది.

గుప్పుమంటున్న గుడుంబా

గుడుంబా రహిత జిల్లాగా అబ్కారీశాఖ ప్రకటించింది. అయితే గుడుంబా తయారీ, విక్రయాలు జిల్లాలో కనుమరుగు కాలేదు. ఇటీవల అక్కడక్కడ దాడులు జరిపి గుడుంబా స్థావరాలను ధ్వంసం చేయడమే దీనికి నిదర్శనం. అంతేగాకుండా గుట్టు చప్పుడు కాకుండా విక్రయానికి తరలిస్తున్న గుడుంబాను స్వాధీనం చేసుకున్న సందర్భాలు ఉన్నాయి. అయినా అబ్కారీశాఖ అడపాదడపా దాడులు మినహా, పూర్తిస్థాయిలో అరికట్టే చర్యలు తీసుకోవడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఉన్నతాధికారులు చొరవ తీసుకొని బెల్ట్ షాపులను అరికట్టడంతోపాటు గుడుంబా తయారు చేయకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఏసీపీ చిత్రపటానికి క్షీరాభిషేకం



ఏసీపీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళా రైతులు

భీమారం, జూలై 14: మండలంలోని ఆరేపల్లి గ్రామంలో దళిత రైతులు జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్ చిత్రపటానికి ఆదివారం క్షీరాభిషేకం చేశారు. రైతులు మాట్లాడుతూ 70 సంవత్సరాల నుంచి తాతలు, తండ్రుల నుంచి భూములను సాగు చేస్తూ జీవిస్తున్నామన్నారు. భీమారం గ్రామానికి చెందిన కట్ట నాగరాజు, చెరుకు సర్వోత్తమ్‌రెడ్డి, పర్తిరెడ్డి మహేశ్వర్‌లు 25 కుటుంబాలకు చెందిన 30 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకోవాలనే దురుద్దేశ్యంతో పంటలను ట్రాక్టర్లతో ధ్వంసం చేశారన్నారు. తమను కులం పేరుతో దూషించారని, దళిత రైతులని చూడకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని భీమారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా జైపూర్ ఏసీపీ క్షేత్రస్థాయిలో భూములను పరిశీలించారన్నారు. విచారణ అనంతరం కట్ట నాగరాజుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి ఆదిలాబాద్ కోర్టుకు తరలించారని, మరో ఇద్దరిపై విచారణ కొనసాగుతుందన్నారు. దళితులపై అక్రమంగా దాడి చేసిన నల్లాల రాజలింగంపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేయడం హర్షణీ యమని తెలిపారు. కార్యక్రమంలో దుర్గం రాములు, రైతులు పాల్గొన్నారు.

రక్తనిధి కేంద్రానికి వాటర్ ప్యూరిఫైయర్ అందజేత

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 14: ఇండియన్ రెడ్‌క్రాస్ మంచిర్యాల రక్తనిధి కేంద్రానికి కుందారపు రవీందర్-కళావతి దంపతులు వారి కుమారుడు కుందారపు సురేష్‌కుమార్ జ్ఞాపకార్థం రూ. 25 వేల విలువ గల వాటర్ ప్యూరిఫైయర్‌ను ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ జిల్లా చైర్మన్ కంకణాల భాస్కర్‌రెడ్డి, మహేందర్, సత్యపాల్‌రెడ్డి, రక్తనిధి సిబ్బంది పాల్గొన్నారు.



వైభవంగా బోనాల జాతర



దండేపల్లి, జన్నారంలో బోనాలతో వెళుతున్న మహిళలు

దండేపల్లి, జూలై 14: కొత్తమామిడిపల్లిలో పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. మహిళలు పోచమ్మతల్లికి నైవేద్యం వండి డప్పు చప్పులు, పంబాలి పూజారుల మంత్రోచ్చారణలతో పోతరాజుల విన్యాసాలతో మహిళలు నెత్తి మీద బోనం ఎత్తుకొని ఊరేగింపుగా పోచమ్మ తల్లి ఆలయానికి వచ్చారు. అనంతరం పోచమ్మ తల్లి ఆలయం చుట్టు ప్రదక్షిణ చేసి నైవేద్యం సమర్పించారు. పంబాలి పూజారులు పోతలింగన్న విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.

జన్నారం: మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో కుటుంబాలతో ర్యాలీగా ఆలయానికి వెళ్లి పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. గోపి, భూమన్న, శ్రీనివాస్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

వాడవాడల మైసమ్మ పూజలు

నస్పూర్: పట్టణంలో ఆషాఢ మాసం సందర్భంగా వాడవాడల మైసమ్మ తల్లి పూజలు నిర్వహించారు. ద్విచక్ర, ట్రాక్టర్ల యజమానులు ఆయా కూడళ్ల వద్ద పూజలు చేసి మేకలను బలిచ్చారు. చల్లంగా చూడాలని పొలిమేర దేవతలకు పూజించి కార్మిక కాలనీలో సైడ్ పిల్లను చేసుకున్నారు. తొళ్ళవాగు దారి మైసమ్మ గుడి వద్ద వివిధ వాహనాల యజమానులు దారి మైసమ్మకు పూజలు నిర్వహించారు. ఆదివారం సెలవు దినం కావడంతో కార్మిక వాడల్లో సైడ్ పిల్లతో సందడి నెలకొంది.

దండేపల్లి: దండేపల్లిలో ట్రాక్టర్ యజమానులు రోడ్డు మైసమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. ట్రాక్టర్‌లను వరుస క్రమంలో పెట్టి పూజల అనంతరం గొర్రెలు, మేకలను బలి ఇచ్చారు. రైతులు పండించే పంటలు బాగా పాడాలని కోరామని పేర్కొన్నారు.

వన దేవతలకు పూజలు

కాసిపేట, జూలై 14: మండలంలోని రొట్టెపల్లి పంచాయతీలోని ఆదివాసీ గిరిజనులు ఆదివారం వన దేవతలకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పెంద్రం హన్మంతు మాట్లాడుతూ వర్షాకాలం ఆరంభం లో పాడి పంటలతో పాటు పశు సంపద అభివృద్ధి చెందాలని పూజలు నిర్వహిస్తామన్నారు. అడవికి వెళ్లే వారికి ఎలాంటి హానీ జరగకుండా ఉండేందుకు పూజలు చేసినట్లు తెలిపారు. ఆదివాసీ గూడాల పటేల్‌లు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

భీమారం, జూలై 14: మండలంలోని ఆరేపల్లి గ్రామానికిచెందిన అనపర్తి చందన (19) కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలోచికిత్స పొందుతూ ఆది వారం మృతి చెందింది. చందనకు జంపన్నతో 11నెలల క్రితం వివాహ మైంది. భర్త జంపన్న, అతని కుటుంబీకుల వరకట్న వేధింపులకు గురిచే స్తుండేవారు. వేధింపులు భరించలేక చందన ఈనెల7న పురుగులమందు తాగింది. గమనించిన కుటుంబీకులు మంచిర్యాలలోని ఆసుపత్రికి తరలిం చగా పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి తండ్రి దుర్గం తిరుపతి ఫిర్యాదు మేరకు భర్త జంపన్న, అత్త లక్ష్మీ, ఆడబిడ్డ వెంకటమ్మ, మామ కనకయ్యలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాములు తెలిపారు.

రోడ్లపైనే వర్షం నీరు.. ఇబ్బందుల్లో ప్రజలు



వివేకానంద చౌక్‌లో రోడ్డుపై నిలిచిన నీరు

ఆసిఫాబాద్, జూలై 14: ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో చిన్నపాటి వర్షం కురిస్తే చాలు రోడ్లపై వరదనీరు భారీగా నిలిచిపోతోంది. దీంతో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టణంలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో వర్షం కురిసినప్పడల్లా వరదనీరు రోడ్లపైనే నిలువ ఉంటోంది. పట్టణంలోని వివేకానందచౌక్, కుమరం భీంచౌక్‌లలో నీరు నిలువ ఉండడంతో నిత్యం అటువైపు నుంచి వెళ్లే వాహనదారులు, పట్టణవాసులకు తీవ్రఇబ్బదులు ఎదురవు తున్నాయి. అధికారులు, ప్రజా ప్రతినిధులు దృష్టి సారించి అవసర మైనచోట డ్రెయినేజీలను నిర్మించి వరదనీరు రోడ్లపై నిలువ ఉండ కుండా దృష్టి సారించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

అటవీశాఖలో ఉద్యోగుల బదిలీ

మంచిర్యాల అర్బన్, జూలై 14: జిల్లా కేంద్రంలోని అటవీశాఖ కార్యాలయంలో ఆదివారం జిల్లాఅటవీశాఖ అధికారి శివ్‌అశిష్ సింగ్‌తోపాటు నలుగురు కమిటీసభ్యులు ఉద్యోగులు, సిబ్బందిబదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. కౌన్సెలింగ్‌లో 43 మంది ఫారెస్టు బీట్ అధికారులు, జూనియర్ అసిస్టెంట్లు, అటెండర్లను బదిలీ చేశారు. జోనల్ పరిధిలో జరిపే బదిలీల కోసం సోమవారం భూపాలపల్లిలోనిఅటవీశాఖ కార్యాలయంలో కౌన్సెలింగ్ ప్రక్రియ జరుగుతుందని, ఏవో, ఎఫ్ఆర్‌వో, సీనియర్ అసిస్టెంట్ ఉద్యోగుల బదిలీలు జరుగుతాయని, 17న మల్టీజోనల్ పరిధిలో బదిలీలు జరుగుతాయని వెల్లడించారు.

కవ్వాల్ టైగర్ జోన్ పరిధిలో...

జన్నారం, జూలై 14: కవ్వాల టైగర్ జోన్‌లోని జన్నారం డివిజన్‌లో ఆదివారం నిర్వహించిన కౌన్సెలింగ్‌లో పలువురు బీట్ అధికారులు బదిలీ అయ్యారు. పైడిపెల్లి బీట్ అధికారిగా తన్వీర్‌పాషా, లోత్‌రై బీట్ అధికారిగా అమృతరావు, గోండుగూడ బీట్ అధికారిగా లాలుబాయి, జన్నారం బీట్ అధికారిగా శ్రీనివాస్, సోనాపూర్ తండా బీట్ అధికారిగా తాజుద్దీన్ నియమితులయ్యారు. కవ్వాల బీట్ అధికారిగా బానయ్య, వర్దన్ పేట్ బీట్ అధికారిగా రుబీనా, నార్లాపూర్ సౌత్ బీట్ అధికారిగా పోచయ్య, తాల్లపేట్ బీట్ అధికారిగా రహీమొద్దీన్, అల్లినగర్ నార్త్ బీట్ అధికారిగా రజనీ, దొంగపెల్లి బీట్ అధికారిగా సంతోష్, లింగాపూర్ అధికారిగా మబ్బుల్ షేక్, కలమడుగు బీట్ అధికారిగా ముజీబొద్దీన్, సింగరాయపేట అధికారిగా అనిత, మాకులపేట పద్మజరాణి బదిలీపై ఇక్కడకు వచ్చారు.

రైలు ఢీకొని యువకుడి మృతి

మంచిర్యాల అర్బన్, జూలై 14 : మంచిర్యాల రైల్వేస్టేషన్ సమీపంలో రాజీవ్‌నగర్ అండర్‌బ్రిడ్జి సమీపంలో లెండుగూరి చిన్నా(19) అనే యువకుడు పట్టాలు దాటుతుండగా రైలుఢీకొని మృతిచెందాడని జీఆర్పీ కానిస్టేబుల్ కెసురేష్‌గౌడ్ తెలిపారు. మృతుడు కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం రుద్రాపూర్ గ్రామానికి చెందినవాడని, పట్టణంలోని రాజీవ్‌నగర్‌లో నివాసంఉంటున్నాడని, కూలీపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడని తెలిపారు. జీఆర్పీ ఎస్సై సుధాకర్ ఆదేశాల మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఆయన పేర్కొన్నారు.

మిస్సింగ్ కేసు నమోదు

నెన్నెల, జూలై 14: మండలంలోని నందులపల్లి గ్రామానికి చెందిన సోమిశెట్టి హన్మంతు అనే రైతు రెండురోజులుగా కనపడటం లేదని ఎస్సై ప్రసాద్ తెలిపారు. మందు స్ప్రేయర్ డబ్బా తెస్తానని రూ.30 వేలు తీసుకొని శనివారం వెళ్లాడని చెప్పారు. బంధువుల ఇళ్లల్లో వెతికినప్పటికి జాడ దొరకలేదన్నారు. భార్య రజిత ఆదివారం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

లక్షెట్టిపేటరూరల్, జూలై 14 : పట్టణంలోని కేఎస్ఆర్ ఫంక్షన్‌హాలులో లక్షెట్టిపేట ఉన్నతపాఠశాల1974-75బ్యాచ్ పదోతరగతివిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. 50 ఏండ్ల తర్వాత కలిసిన వారు నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుని ఆనందంగా గడిపారు. సుమారు వంద మందికిపైగా ఆత్మీయసమ్మేళనంలో పాల్గొని ఒకరిగురించి ఒకరు తెలుసుకున్నారు. న్యాయవాది చుంచు సదానందంతోపాటు కొత్త మహేందర్, సత్యనారాయణగౌడ్, ప్రకాష్, రాంమోహన్, మనోహర్, శంకర్, జీవన్, భక్తవత్సలం, లక్ష్మీరాజం,ప్రభాకర్, కాంతయ్య తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని కళాంజలి ఫంక్షన్‌హాలులో స్దానిక విజ్ఞాన్ విద్యాలయంలో 1999-2000 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. భాస్కర్, సురేష్‌నాయక్, రాకేష్, అనిల్ పాల్గొన్నారు.

పోడు సాగును అడ్డుకుంటున్న అటవీ అధికారులు

కోటపల్లి, జూలై 14: మండలంలో పోడు సాగును అడ్డుకుంటున్న అటవీ శాఖ అధికారులపై కేసు నమోదు చేయాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్మ పున్నం డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని బొప్పారం గ్రామంలో బాధిత రైతులతో కలిసి ఆయన మాట్లాడారు. ఈ గ్రామంలో రెండు రోజుల క్రితం బానోత్ రాజేష్, బానోత్ ప్రశాంత్, రత్న సురేష్, కన్నవేని శంకర్ అనే పోడు సాగుదారులు చేసిన పత్తి చేనులో అటవీ శాఖ అధికారులు గడ్డి మందు కొట్టి పంటను నష్టం చేయడం సరికాదన్నారు. ఎమ్మెల్యే వివేక్ సైతం పోడు సాగుదా రుల జోలికి వెళ్లవద్దని అటవీ శాఖ అధికారులకు చెప్పినా వారు ఆయన మాటలను సైతం లెక్క చేయడం లేదన్నారు. గిరిజనులకు చెందిన రైతులకు చట్ట ప్రకారం హక్కు పత్రాలు ఉన్నా చేను చుట్టూ ఉన్న కం చెను తొలగించి గడ్డి మందు స్ప్రే చేసి పంటలను ధ్వంసం చేశారన్నారు. అలాగే పలు చోట్ల పంటలను సాగు చేస్తున్న



బాధిత రైతులతో కలిసి మాట్లాడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

పోడుదారులపై దాడులు చేస్తున్నారని, ఇలాంటి వారిపైన కేసులు నమోదు చేయాలని లేకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

పోడు భూముల సమస్యలు పరిష్కరించాలి



బండి సంజయ్‌కు వినతిపత్రం ఇస్తున్న మాజీ ఎంపీపీ

కోటపల్లి, జూలై 14: మండలంలో పోడు భూముల సమస్యలను పరిష్కరించాలని ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో కేంద్రం హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు వినతిపత్రం ఇచ్చినట్లు మాజీ ఎంపీపీ మంత్రి సురేఖరామయ్య పేర్కొన్నారు. మండలంలో 40 సంవత్సరాలుగా పోడు సాగు చేసుకుంటుండగా అటవీ అధికారులు దాడులు చేస్తున్నారని, దీనిపై న్యాయం చేయాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. అలాగే మండల కేంద్రంలో ఆర్అండ్‌బీ రోడ్డు వెడల్పులో బాగంగా ఇండ్లు కోల్పోయిన నిర్వాసితులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి వంద ఇందిరమ్మ ఇండ్లు ఇప్పించాలని కోరినట్లు పేర్కొన్నారు. సిర్సా మాజీ సర్పంచు పెద్దింటి పున్నంచంద్, బీజేపీ మండల ఇన్‌చార్జీ నాగేశ్వర్ రావు, మండల అధ్యక్షుడు మంత్రి రామయ్య, నాయకురాల్లు మణిమాల, జెల్ల రజిత, శారద పాల్గొన్నారు.

పట్టాలు ఇప్పించాలని ఎమ్మెల్యేకు వినతి

మంచిర్యాల అర్బన్, జూలై 14: చెన్నూరు నియోజకవర్గంలోని కోటపల్లి మండలంలో 40 యేండ్లుగా పోడు భూములను సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలు ఇప్పించేలా కృషి చేయాలని ఆదివారం బీజేపీ నాయకులు దుర్గం అశోక్ నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఆ ప్రాంతంలో గిరిజనేతరులైన ఎస్సీ, బీసీ వర్గాలకు చెందిన అనేక మంది రైతులు పోడు భూములను సాగు చేసుకుంటున్నారని తెలిపారు. గతంలో రాష్ట్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం వారికి పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చిందని, కానీ పట్టాలు ఇవ్వలేదని పేర్కొన్నారు. ఈ విషయాన్ని అగ్ర నాయకుల దృష్టికి తీసుకువెళ్లి పట్టాలను ఇప్పించాలని ఆయన కోరారు.

దళితులకు అండగా ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం

దండేపల్లి, జూలై 14: దళితులకు అండగా ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం కృషి చేస్తుందని ఆసంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బోంకూరి మధు, జిల్లా కన్వీనర్ నేరువట్ల రాజలింగులు అన్నారు. ఆదివారం దండేపల్లిలో మండలస్థాయి సమావేశం నిర్వహించి మండల కమిటీని ప్రకటించారు. సంఘం మండల అధ్యక్షుడిగా జిల్లాపెల్లి రాజశేఖర్, ఉపాధ్యక్షుడిగా కోడి రాజేష్, ప్రధాన కార్యదర్శిగా శాతరాజు ఈశ్వర్, కార్యదర్శిగా దుట సాయికుమార్, తీగల చరణ్, ప్రశాంత్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం జిల్లా కో కన్వీనర్ కొల్లూరి రవికుమార్, మాజీ ఎంపీటీసీ కొంగల నవీన్, నేతకాని సంఘం రాష్ట్ర నాయకులు జాడి ప్రేమ్‌సాగర్, వినయ్, దినేష్, సుమన్ బీసీ సంఘం నాయకులు బొమ్మెన మహేష్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మంచిర్యాల అర్బన్, జూలై 14 : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. పట్టణంలోని పాత మంచిర్యాలలో గల ఓ ప్రైవేటు కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం జరిగిన పీఆర్‌టీయూ జిల్లా కార్యవర్గ సమావేశంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యేకు ఉపాధ్యాయులు పలు పెండింగ్ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని విన్నవించగా సానుకూలంగా స్పందించారు. ప్రధాన కార్యదర్శి కొట్టె శంకర్, పంచాయతీరాజ్ మాసపత్రిక సంపాదకవర్గ సభ్యులు రాసపల్లి రవి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సాంబమూర్తి, శ్రీధర్‌రెడ్డి, సత్యనారాయణ, ఉమాకాంతరావు, మనోహర్, జనార్దన్, తిరుపతి, జ్యోతి, మండల శాఖల అధ్యక్ష కార్యదర్శులు, రాష్ట్ర, జిల్లా బాధ్యులు పాల్గొన్నారు.

సత్యదేవున్ని దర్శించుకున్న డిప్యూటీ డైరెక్టర్

దండేపల్లి, జూలై 14: గూడెం సత్యనారాయణ స్వామి దేవస్థానంలో ఆదివారం వరంగల్ ఉమ్మడి జిల్లా డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ మోకిల సత్యనారాయణ సత్యదేవున్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అధికారులు, ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణతో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దర్శనం అనంతరం ఆశీర్వచనం, తీర్థప్రసాదాలను అందజేశారు.

తల్లిదండ్రులకు అవగాహన

హాజీపూర్, జూలై 14: దొనబండ స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు హన్మాండ్లు ఆదివారం ప్రైవేటు పాఠశాలలకు పంపే పిల్లల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య, భోజనం అందిస్తామని తెలిపారు. పిల్లలను గొల్లపల్లిలోని ప్రభుత్వ పాఠశాలకు పంపిస్తామని తల్లిదండ్రులు హామీ ఇచ్చారు.

సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు



దోమల నివారణ మందు పిచికారి చేస్తున్న సిబ్బంది

బెల్లంపల్లి, జూలై 14 : వర్షాల దృష్ట్యా సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత అన్నారు. ఆదివారం పట్టణంలోని 19వ వార్డులో మున్సిపల్ సిబ్బంది దోమల నివారణ మందులు, బ్లీచింగ్ పౌడర్ పిచికారీ చేయించారు. ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కౌన్సిలర్ సురేష్, ఏఈ సందీప్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సంతోష్, టీఎంసీ దుర్గయ్య, ఆర్పీ రాజ్యలక్ష్మీ,ఆశా కార్యకర్త ధన లక్ష్మీ, నసీమా తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ గిరిజనుల సంక్షేమానికి కృషి

దండేపల్లి,జూలై 14 : ఆదివాసి గిరిజనుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని, తాను శాయశక్తులా కృషి చేస్తానని రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ చైర్మన్ కోట్నాక తిరుపతి అన్నారు. ఆదివారం కుటుంబసభ్యులతో కలిసి మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు నివాస గృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు. తన మీద నమ్మకంతో చైర్మన్ పదవి రావడానికి కృషి చేసిన ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావుకు రుణపడి ఉంటానన్నారు. గిరిజనుల సంక్షేమాభివృద్ధికి ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్య మంత్రి విక్రమార్క, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, స్థానిక ఎమ్మెల్యే సహకారంతో గిరిజన అభివృద్ధికి పాటుపడుతానన్నారు.



ఎమ్మెల్యేను కలిసిన గిరిజన కార్పొరేషన్ చైర్మన్ తిరుపతి

కాంగ్రెస్, బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరికలు



బీజేపీలో చేరుతున్న వారికి కండువా కప్పుతున్న ఎంపీ గోడం నగేష్

వాంకిడి, జూలై 14: ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ఒడ్డెపల్లి గార్డెన్స్‌లో జరిగిన బీజేపీ కార్యకర్తల సమావేశంలో ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్ ఆధ్వర్యంలో వాంకిడి మండలానికి చెందిన పలువురు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆదివారం బీజేపీలో చేరారు. వాంకిడి మాజీఎంపీటీసీ పెంటు, కిరిడి మాజీ ఎంపీటీసీ సోమేశ్వర్, మాజీ వార్డుమెంబర్ మల్లయ్య, సోమయ్య, రాజేష్, మహేష్, అక్షయ్,సాయి తదితరులు బీజేపీలో చేరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లాఅధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, నాయకులు విజయకుమార్, అరిగెల నాగేశ్వర్‌రావు, మల్లికార్జున్ యాదవ్, సుచిత్, సతీష్‌బాబు, విశాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణహిత- చేవెళ్ల ప్రాజెక్టును పూర్తి చేయాలి

● బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

చింతలమానేపల్లి, జూలై 14: రైతాంగానికి సాగు నీరు అందించాలనే లక్ష్యంతో నాడు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రాణహిత- చేవెళ్ల ప్రాజెక్టును వెంటనే పూర్తిచేయాలని బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేవారు. ఆదివారం చింతలమానేపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాణహిత- చేవెళ్ల ప్రాజెక్టులో భాగంగా సేకరించిన భూముల రైతులకు ఇంకా నష్టపరిహారం అందలేదని తక్షణమే పరిహారం చెల్లించాలని అన్నారు. సిర్పూర్ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న తుమ్మిడి హెట్టి, సాండ్‌గాం, రణవెల్లి, కోర్సిని,గూడెం, హుడ్కిలి, లోనవెల్లి, సుర్దాపూర్, జంబుగ ఎత్తిపోతల ప్రాజెక్టులు పూర్తిచేసి సాగు నీరు అందించాలన్నారు. ఎన్నో ఏళ్లుగా అసంపూర్తిగా ఉన్న అడప్రాజెక్టు పూర్తి చేయడానికి ప్రభుత్వం రూ.20కోట్లు మంజూరుచేసి 10వేల ఎకరాలకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకో వాలని అన్నారు. చెరువుల నుంచి పంట పొలాలకు నీరు పారే కాలువలు పూడుకు పోయాయన్నారు. తూము గేట్లు మరమ్మతులు చేయాలన్నారు. లేనిపక్షంలో రైతులకు మద్దతుగా త్వరలోనే జిల్లా కలెక్టరేట్ కార్యాలయాన్ని ముట్టడించేలా కార్యాచరణ రూపొందిస్తామన్నారు. కాగజ్‌నగర్ మండలం అంకుశాపూర్‌లో అధికార కాంగ్రెస్ నాయకులు చట్టవిరుద్ధంగా నిర్మిస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పులుల అభయరణ్యానికి కేవలం 60కిలో మీటర్ల దూరంలో నేషనల్ టైగర్‌కన్జర్వేషన్ అథారిటీ, నేషనల్ బోర్డు ఫర్ వైల్డ్‌లైఫ్ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా చట్టవిరుద్ధంగా ఏర్పాటు చేస్తున్నారని ఆరోపించారు. ఫ్యాక్టరీ పూర్తయితే పచ్చని పల్లెలు కాలుష్యం బారిన పడే అకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. చింతలమానేపల్లి మండలం కర్జవెల్లి-గూడెం రోడ్డుకు బీటీనిర్మాణం చేపట్టాలన్నారు. కర్జవెల్లి-గూడెం రోడ్డు వర్షాలకు దెబ్బతిని నరక కూపంలా మారిందన్నారు. గూడెం నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్‌తోపాటు ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారని ఆరోపించారు. మాజీఎమ్మెల్యే కోనేరు కోనప్ప హయాంలో కోట్ల రూపాయలు గూడెం బ్రిడ్జి కాంట్రాక్టు తన అనుచ రులకు దక్కించుకున్నారు. కానీ గూడెంబీటీ రోడ్డును నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. చింతలమానేపల్లి కస్తూర్బా గాంధీ విద్యాలయంలో అప్రోచ్‌రోడ్డు లేక వర్షాకాలంలో విద్యార్థులు తీవ్రఇబ్బందులు ఎదుర్కొం టున్నారని అన్నారు. అధికార పార్టీలోకి వెళ్లిన ఎమ్మెల్యే దండె విఠల్ చొరవ తీసుకుని కేజీబీవీ పాఠశాలకు రోడ్డు నిర్మించేలా ఎందుకు చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు. తెలంగాణలో ఆంధ్ర గుండాగిరి నడవ దన్నారు. తెలంగాణ ఉద్యమకారులు ఏకమై మళ్లీ బీఆర్ఎస్‌ను అధికారంలోకి తీసుకొచ్చేలా పార్టీని బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయ కులు లహంచు, నీలాగౌడ్,రాంప్రసాద్, రాజ్‌కుమార్, నవీన్, బండు, వెంకటేష్, గోవింద్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు

కాగజ్‌నగర్ టౌన్, జూలై 14: కాగజ్‌నగర్ ప్రభుత్వ పాఠశాల(ఓల్డు) 1992-93 బ్యాచ్‌కు చెందిన ఎస్సెస్సీ విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అనంతరం వివిధ సంస్కృతిక కార్యక్రమాలను నిర్వ హించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మూర్తి, డేవిడ్ ఫ్రాన్సిస్, గుప్తా, బాపుగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మొహర్రంలో మలీద మొక్కులు

రెబ్బెన, జూలై 14: మొహర్రంలో భాగంగా ఆదివారం రెబ్బెన మండలంలోని పుంజుమేర గూడలోని భువమ్మ తల్లి ఆలయంలో సరిగెత్తు సందర్భంగా మలీద మొక్కులను భక్తులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు. ఆదివారం రాత్రి భువమ్మ తల్లి దర్శనమిస్తుందని, మంగళవారం పెద్దసరిగెత్తు ఉంటుందని దేవస్థాన కమిటీ సభ్యులు వివరించారు.



అన్నదానంలో పాల్గొన్న భక్తులు

గర్భిణి ప్రాణం కాపాడిన ఎంఐఎం నాయకుడు



రక్తదానం చేస్తున్న సల్మాన్‌ఖాన్

ఆసిఫాబాద్ రూరల్, జూలై 14: బెజ్జూరు మండలం తలాయి గ్రామానికి చెందిన సెడ్మెక లక్ష్మి ఎనిమిది నెలల గర్భవతి. ఆమెకు ఒంట్లో నాలుగు గ్రాముల రక్తం మాత్రమే ఉన్నట్లుగా స్థానిక వైద్యులు తెలిపారు. రక్తం ఎక్కించకపోతే తల్లీబిడ్డకు ప్రమాదం అని సూచించారు. దీంతో కుటుంబీకులు ఆమెను హుటాహుటిన జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఆసిఫాబాద్ ఎంఐఎం పట్టణాధ్యక్షుడు మొహమ్మద్ సల్మాన్‌ఖాన్ ఆసుపత్రికి చేరుకొని మహిళకు రెండు బాటిళ్ల రక్తం అవసరం ఉండగా సహచరులతో ఒక బాటిల్‌ను సమకూర్చి మరొకటి తాను ఇచ్చి ప్రమాదం నుంచి కాపాడారు. సల్మాన్‌ఖాన్ సేవా గుణానికి మహిళ కుటుంబసభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం: కోనప్ప



పెంచికలపేటలో బాధితులను పరామర్శిస్తున్న కోనేరు కోనప్ప

బెజ్జూరు, జూలై 14: మండల కేంద్రానికి చెందిన సామల లక్ష్మి, ఇప్పలగూడ గ్రామానికి చెందిన కొడప సిద్ధయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా వారి కుటుంబాలను ఆదివారం మాజీఎమ్మెల్యే కోనేరు కోనప్ప పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితకుటుంబాలకు అండగా ఉంటామన్నారు. ఆయనవెంట నాయకులు శ్రీవర్ధన్, రామకృష్ణ, జావీద్‌అలీ, సతీష్, బషరత్‌ఖాన్, శ్రీనివాస్, ఇస్తారు, సాయి, అనీల్ తదితరులు పాల్గొన్నారు.

దహెగాం(పెంచికలపేట): పెంచికలపేట మండలంలోని ఆగర్‌గూడ గ్రామానికి చెందిన సిడాం ఆకాష్ రెండు రోజుల క్రితం మృతిచెందగా బాధిత కుటుంబసభ్యులను ఆదివారం మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పరామర్శించారు. లోడ్పెల్లి గ్రామంలో నికాడిబాపురావు శనివారం మృతిచెందగా కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట నాయకులు ఉన్నారు.

'రాజ్యాంగంలో గోండి భాషకు గుర్తింపు ఇవ్వాలి'

జైనూర్, జూలై 14: భారత రాజ్యాంగంలో గోండి భాషకు ప్రత్యేక గుర్తింపు ఇవ్వాలని గోండి ధర్మ కోయ పుణ్యం రాష్ట్ర అధ్యక్షుడు అర్క మానిక్‌రావ్ అన్నారు. మహారాష్ట్రలోని కిన్వట్‌లో ఆదివారం జరిగిన గోండి ధర్మ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కొనసాగుతున్న కుల గణనలో గోండి భాషకు ప్రత్యేక కాలం కేటాయించాలని ఆయన డిమాండ్‌చేశారు. అదే విధంగా తరతరాలుగా ఆదివాసులు ధర్మ సంస్కృతిని నమ్ముకుంటూ వస్తున్నారని, ఇప్పటివరకు తమ గోండి ధర్మానికి, భాషకు గుర్తింపు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆత్రం ఆనంద్‌రావ్, ఆదివాసీ నాయకులు మడావి శేషరావ్, కోట్నాక కోసేరావ్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే గేటు వద్ద ట్రాఫిక్ జాం



రైల్వేగేటు వద్ద నిలిచి పోయిన వాహనాలు

సిర్పూర్(టి), జూలై 14: సిర్పూర్(టి)-కాగజ్‌నగర్ ప్రధాన రహదారిపై వెంపల్లి రైల్వే గేటు వద్ద ఒకేసారి నాలుగు రైళ్లు వెళ్లడంతో పాటు కొద్దిసేపగేటు మొరాయించడంతో గంటన్నరపాటు వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడ్డారు. రైల్వేగేటు సమీపంలో రోడ్డుపై గుంతలు ఉండడంతో పలువురు ద్విచక్ర వాహనదారులు గుంతల్లో పడిపోయారు. ఆర్వోబీ పూర్తి చేసేవరకు రోడ్డుకు మరమ్మతులు జరిపించాలని వాహనదారులు కోరుతున్నారు.



రైల్వే గేటు వద్ద గుంతల మయంగా ఉన్న రోడ్డు

జిల్లాలో మోస్తరు వర్షం



కాగజ్‌నగర్‌లో కురుస్తున్న వర్షం

ఆసిఫాబాద్, జూలై 14: జిల్లాలో ఆదివారం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంతోపాటు కాగజ్‌నగర్, తిర్యాణి, దహెగాం మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది. గడిచిన 24గంటల్లో జిల్లావ్యాప్తంగా 10.5మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయింది. అత్యధికంగా చింతలమానేపల్లిలో 22.6మిల్లీమీటర్లు అత్యల్పంగా వాంకిడిలో 3.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. మిగితా మండలాలైన కెర మెరిలో 21.4మిల్లీమీటర్లు, తిర్యాణి, దహెగాంలలో 14.6, రెబ్బెనలో 12.2, ఆసిఫాబాద్‌లో 10.6, పెంచికలపేటలో 9.6, కౌటాలలో 9.2, లింగాపూర్‌లో 8.2, జైనూరులో7.4, బెజ్జూరులో 7.2, సిర్పూర్(టి)లో 7,సిర్పూర్(యు)లో 5.4, కాగజ్‌నగర్‌లో 4.4, వాంకిడిలో 3.2మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయింది.

కాగజ్‌నగర్‌లో కురిసిన వర్షం

కాగజ్‌నగర్, జూలై 14: కాగజ్‌నగర్‌పట్టణంలో ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి అరగంట పాటు వర్షం కురిసింది. ఆదివారం పట్టణలో వార సంత ఉండటంతో వర్షంతో ప్రజలు కూరగాయాలు కొనుగోలు చేయలేని పరిస్థితి ఏర్పడింది. అలాగే పలు కాలనీల్లో అంతర్గత రోడ్లు బురదమయంగా మారాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.



ఘనంగా పోచమ్మ మొక్కులు

కాగజ్‌నగర్, జూలై 14: కాగజ్‌నగర్‌పోచమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు సకాలంలో వర్షాలు కురవాలని అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నట్టు పేర్కొన్నారు. భక్తులకు ఆలయక మిటీ సభ్యులు అన్నిఏర్పాట్లు చేశారు.



మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

ప్రైవేటు బస్సుల జోరు..

అవి స్లీపర్ కోచ్ బస్సులు.. ఇతర రాష్ట్రాల ప్రయాణికుల కోసం ఆయా రాష్ట్రాలకు చెందిన వ్యక్తులు వాటిని నడిపిస్తున్నారు. మన రాష్ట్రంలోని ఆయా రాష్ట్రాలకు చెందిన కూలీలు, కొందరు వ్యాపారవేత్తలు ఈ బస్సుల్లోనే ప్రయాణిస్తుంటారు. ఈ బస్సులు రాష్ట్ర ప్రభుత్వ ఖాజానాకు గండికొడుతున్నాయి. వీటి యజమానులు అనుమతి లేని రూట్లలో నడిపిస్తూ టోల్‌ట్యాక్స్, ఇతర పన్నులను ఎగ్గొడుతున్నారు. కొన్ని సందర్భాల్లో ఫిట్ నెస్‌లేని బస్సులు నడుపుతూ ప్రమాదకర ప్రయాణాలు సాగిస్తున్నారు. దీంతో ప్రయాణికుల ప్రాణాలకు కూడా భద్రతలేని పరిస్థితి నెలకొంది.

- అడ్డదారిగా మారిన కాగజ్‌నగర్ రూట్
- జాతీయ రహదారికి చెక్ పెట్టి టోల్‌టాక్స్, ఇతర పన్నులు ఎగవేత
- ఫిట్‌నెస్ లేని బస్సులు
- 'మాములు'గా తీసుకుంటున్న అధికారులు
- కాగజ్‌నగర్-రాయ్‌పూర్ రూట్లో నిత్యం ప్రయాణాలు

కాగజ్‌నగర్ టౌన్, జూలై 14: హైదరాబాద్-రాయ్‌పూర్ (ఛత్తీస్‌గడ్) వరకు ప్రైవేటు స్లీపర్ బస్సులు ప్రయాణికులతో గమ్యాన్ని చేరవేస్తుంటాయి. అయితే ఇందులో చిన్నపాటి ట్విస్ట్‌ను వాడుకొని ఏకంగా ప్రభుత్వానికి పన్ను ఎగవేస్తూ లక్షల్లో లాభాలు గడిస్తున్నారు.. సికింద్రాబాద్ మీదుగా కరీంనగర్, మంచిర్యాల, ఆసిఫాబాద్, చంద్రాపూర్ మీదుగా ఛత్తీస్‌గడ్ రాష్ట్రంలోని రాయ్‌పూర్‌కు వెళ్లాల్సి ఉండగా, ప్రయివేటు బస్సుల వారు కాగజ్‌నగర్ క్రాస్‌రోడ్డు కాగజ్‌నగర్, సిర్పూరు (టి)మండలం పెన్‌గంగా అంతరాష్ట్ర వంతెన మీదుగా చంద్రాపూర్‌కు వెళ్లతున్నారు. వాస్తవంగా ఈ రూట్లో బస్సుల ప్రయాణాలకు అనుమతి లేదు.

వర్షాకాలంలో సిర్పూరు(టి) పెన్‌గంగా వద్ద వెంకట్రావుపేట బ్రిడ్జిపై నుంచి వరద ప్రవహించడంతో ఒక పిల్లర్ కుంగిపోయింది. దీంతో భారీ వాహనాలకు అనుమతి ఇవ్వటం లేదు. అయినప్పటికీ అర్ధరాత్రి వేళల్లో వందల మేర ప్రయివేటు బస్సులను నడిపిస్తున్నారు. ఆసిఫాబాద్ మీదుగా వాంకిడి వరకు ఇక్కడ సరిహద్దు చెక్‌పోస్టు, మహారాష్ట్రలోని చంద్రాపూర్ వద్ద మరో అంతరాష్ట్ర చెక్‌పోస్టులకు పన్నులు కట్టాల్సి ఉంది. ఈ పన్నుల ఎగవేసేందుకు ఏకం గా కాగజ్‌నగర్ మీదుగా దారి మళ్లించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా పట్టించుకోవాల్సిన అధికారులకు నెలనెల టంచన్‌గా మాముళ్లు అందుతుంటంతో కనీసం ఇటు వైపు కన్నెత్తి చూడటం లేదంటే పరిస్థితి ఏ మేర ఉందో ఇట్టే ఊహించుకోవచ్చు.

ఫిట్‌నెస్ లేని బస్సులతో ప్రయాణాలు..

సికింద్రాబాద్-రాయ్‌పూర్‌కు నిత్యం వందలాది ప్రైవేటు బస్సుల్లో ప్రయాణికులను తరలిస్తుంటారు. ఒక్కొక్కరి వద్ద నుంచి రూ.2వేల వసూలు చేస్తున్నారు. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని రాయ్‌పూర్‌కు చెందిన వలసకూలీలు పనుల కోసం హైదరాబాద్‌కు వెళ్లతుంటారు. వీరే కాకుండా మహారాష్ట్ర ప్రాంతంలోని పలువురు కూడా వ్యాపారాల నిమిత్తం హైదరాబాద్‌కు ప్రయాణిస్తుంటారు. స్లీపర్ కోచ్‌లు కావటంతో ప్రయివేటు బస్సులకు డిమాండు ఎక్కువగా ఉంది. దీన్ని ఆసరగా తీసుకొని ప్రైవేటు బస్సుల నిర్వాహకులు కోట్లాది రూపాయల మేర రాష్ట్ర ఖజానాకు గండి కొడుతున్నారు. అధికారులను మచ్చిక చేసుకుని ఈ తతంగాన్ని కొనసాగిస్తున్నారు. బస్సులను నిత్యం తనిఖీ చేయాల్సిన అధికారులు పట్టించుకోవటం లేదు. ఫిట్‌నెస్ లేని బస్సులు, అనుమతులు లేని బస్సుల్లో కూడా ప్రయాణికులను చేరవేస్తున్నారు. ప్రయాణాలకు భద్రత లేకుండా నడిపిస్తున్నారు. రాత్రి వేళల్లో ఎవరూ చూడటం లేదన్న ధీమాలో అతివేగంగా ఈ బస్సులను నడిపిస్తున్నారు.

కాగజ్‌నగర్‌లో పలుమార్లు పోలీసులు ఆపినా కూడా ఆగని సందర్భాలున్నాయి. కోట్లాది రూపాయలతో రాష్ట్ర ప్రభుత్వం రహదారులు నిర్మిస్తే ఈ బస్సులతో రోడ్లన్నీ ఛిద్రం అవుతున్నాయని ఆయాగ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. శుక్రవారం రాత్రి కూడా కాగజ్‌నగర్ క్రాస్‌రోడ్డు నుంచి రాయ్‌పూర్‌కు వెళ్లతున్న ఓ బస్సు టైరు కిందభాగం చెడిపోవటంతో ఒకవైపు వంగిపోయింది. అలాగే 12కిలోమీటర్ల మేర ప్రయాణించి కాగజ్‌నగర్ వరకు వచ్చి మరమ్మతులు చేశారు. వెనుకనుంచి ద్విచక్రవాహనదారుడు ఓవర్‌టేక్ చేసి డ్రైవర్‌ను అప్రమత్తం చేయటంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. ఈ విషయాన్ని సంబంధిత జిల్లా రవాణాశాఖ అధికారికి కొంత మంది నేరుగా ఫోటోలు తీసి పంపించారు. అర్ధరాత్రి 12గంటల వరకు ఈ బస్సులో ప్రయాణికులు బయటనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒకవైపు వర్షం కురియటం, మరోవైపు బస్సు చెడిపోవటం జరిగినప్పటికీ అధికారులు పట్టించుకోలేదు. అయితే సంబంధిత నిర్వాహకులను బస్సుల విషయం ప్రశ్నిస్తే అంతా మాములే అంటూ సమాధానం ఇచ్చారు.

నిఘా పెడితేనే ఈ దందాకు చెక్..

హైదరాబాద్-రాయ్‌పూర్‌కు జాతీయ రహదారి ఉన్నప్పటికీ కాగజ్‌నగర్ మీదుగా అడ్డదారి గుండా ప్రయివేటు బస్సుల దందాకు చెక్ పడాలంటే ఆయాశాఖల అధికారులు సమన్వయంతో నిఘా పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నిత్యం తనిఖీలు చేస్తే ఈ దందాలో జరిగే అవినీతి బయటపడే అవకాశాలున్నాయి. ఈ దందాను కొంత మంది దళారుల వారి కనుసన్నల్లో నడిపిస్తున్నట్టు ఆరోపణలున్నాయి. వీరి ద్వారా అధికారులకు మాముళ్ల కూడా చేరవేరస్తున్నట్టు ఆరోపణలున్నాయి. ప్రయాణికుల భద్రతను పక్కన పెట్టి ప్రైవేటు బస్సుల యాజమానులు లాభార్జనే ధ్యేయంగా ఈ దందాను కొనసాగిస్తున్నారని అంతా బాహాటంగా ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా రోడ్డు రవాణా శాఖ, జిల్లా పోలీసులు వెంటనే స్పందించి ఈ దందాపై గట్టి నిఘా పెట్టాలని అంతా కోరుతున్నారు.



కాగజ్‌నగర్‌లో చెడిపోయిన హైదరాబాద్-రాయ్‌పూర్ ప్రైవేటు స్లీపర్ బస్సు



రాత్రి 12 గంటలకు బస్సుకు మరమ్మతు



కాగజ్‌నగర్ క్రాస్ రోడ్డు మీదుగా వెళ్లాల్సిన జాతీయ రహదారి

తప్పకుండా చర్యలు తీసుకుంటాం..
రాంచందర్, జిల్లా రవాణాశాఖ అధికారి

కాగజ్‌నగర్-రాయ్‌పూర్ వరకు నడుస్తున్న ప్రయివేటు బస్సుల దందాపై తప్పకుండా నిఘా పెడుతాం. త్వరలోనే స్పెషల్ టాస్క్ చేపడుతాం. ఈ మార్గంలో పోయేందుకు అనుమతి లేదు. ప్రభుత్వ పన్ను కడితేనే అనుమతి ఉంటుంది. జాతీయ రహదారి మీద పోయేందుకు వీలు ఉంది. దారి మళ్లించటం సరికాదు. తప్పకుండా చర్యలు తీసుకుంటాం. అనుమతి లేకుంటే బస్సులను సీజ్ చేస్తాను.

నిఘా పెడుతాం..:కరుణాకర్, డీఎస్పీ, కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ మీదుగా దారి మళ్లించి రాయ్‌పూర్ వరకు వెళ్లతున్న ప్రయివేటు బస్సులపై గట్టి నిఘా పెడుతాం. నిత్యం వీటిని చెక్ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తాం. అనుమతి లేని బస్సులను వెళ్లనీయం. తప్పకుండా తగిన చర్యలు తీసుకుంటాం. ఎవరిని కూడా ఉపేక్షించేది లేదు. ప్రయాణిల భద్రతపై దృష్టి సారిస్తాం.

అధికారుల నిర్లక్ష్యంతోనే గని మూసివేత



మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్



మాట్లాడుతున్న రాజిరెడ్డి



మాట్లాడుతున్న నాయకులు

శ్రీరాంపూర్, జూలై 14: శ్రీరాంపూర్‌లోని ఆర్కే7 గనిని తాత్కాలికంగా మూసివేతకు అధికారుల నిర్లక్ష్యమే కారణమని హెచ్ఎంఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎండీ రియాజ్‌అహ్మద్ ఆరోపించారు. నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన మాట్లాడారు. ఎంతో చరిత్రకలిగిన ఆర్కే7 గని అనుమతుల విషయంలో ఆరేళ్లుగా అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. సింగరేణికి చెందిన ప్రాజెక్ట్స్, ప్లానింగ్ డైరెక్టర్, జీఎంలు, ఎస్టేట్స్, అటవీశాఖ అధికారులు ఈ నిర్లక్ష్యానికి బాధ్యత వహించాలన్నారు. వారిని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు చిన్నతప్పు చేస్తే చార్జిషీట్లు, సస్పెండ్లు చేస్తారని మరి అధికారులు తప్పు చేస్తే మేనేజ్‌మెంట్ ఏం చేస్తుందని ఆయన అన్నారు. ఇంత జరుగుతున్నా గుర్తింపుసంఘం ఏఐటీయూసీ మిన్నకుండడం సరికాదన్నారు. అవసరమైతే తమ యూనియన్ పక్షాన సపోర్ట్ చేస్తామని తెలిపారు. ఆ గనికి చెందిన కార్మికులను దూరప్రాంతాలకు బదిలీ చేయవద్దని కోరారు. అలా జరిగితే తాము వారి పక్షాన నిలబడి పోరాడుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో యూనియన్ ఏరియా ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య, కార్యదర్శి వి అనిల్‌రెడ్డి, పిట్ కార్యదర్శులు రాజేంద్రప్రసాద్, దుర్గం లక్ష్మణ్, అశోక్, సందీప్, అనిల్, ప్రదీప్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను ఇబ్బంది పెట్టొద్దు

శ్రీరాంపూర్, జూలై 14 : శ్రీరాంపూర్‌లోని ఆర్కే7 గనిని తాత్కాలికంగా మూసివేస్తున్నామని ప్రకటించిన యాజమాన్యం కార్మికులను ఇబ్బందులకు గురిచేయవద్దని టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి, ప్రధానకార్యదర్శి కె సురేందర్‌రెడ్డి అన్నారు. నస్పూర్- శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం వారు మాట్లాడారు. గనికి సంబంధించిన అనుమతులు తీసుకొని బొగ్గు తీయాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లనే చాలా మంది కార్మికులు ఆందోళన చెందుతున్నారన్నారు. శ్రీరాంపూర్‌లోని మరిన్ని గనులకు ఇదే పరిస్థితి వచ్చే అవకాశం ఉందన్నారు. ఇంకా బొగ్గు తీసుకునేందుకు అవకాశం ఉన్న గని గురించి ఇంతనిర్లక్ష్యం ఎందుకన్నారు. వెంటనే అధికారులపై చర్యలు తీసుకొని, కార్మికులను ఏరియాలోని గనుల్లో సర్దుబాటు చేయాలన్నారు. తాము ఎల్లప్పుడూ కార్మికులకు అండగా నిలుస్తామని పేర్కొన్నారు. సమావేశంలో ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్, షైపాల్‌రెడ్డి, రమేష్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులు ఆందోళన చెందవద్దు

శ్రీరాంపూర్, జూలై 14: ఆర్కే7 గని కార్మికులు ఆందోళన చెందవద్దని ఏఐటీయూసీ ఉప ప్రధానకార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముష్కె సమ్మయ్య, బ్రాంచ్‌కార్యదర్శి ఎస్‌కె బాజీసైదా కోరారు. ఎస్ఆర్పీ3గనిపై నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. అటవీశాఖ అధికారులు గని ఉత్పత్తిని నిలిపివేయాలని ఆదేశించడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నా మన్నారు. అనుమతులు వచ్చేవరకు బొగ్గు ఉత్పత్తి చేసేందుకు సహకరించాలని సోమవారం తమ యూనియన్ ఆధ్వర్యంలో అటవీశాఖ అధికారులకు, జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రాలు ఇస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్‌ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్‌రావు, ఏరియా కార్యదర్శులు ప్రసాద్ రెడ్డి, సారయ్య, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను నట్టేట ముంచిన ఏఐటీయూసీ

శ్రీరాంపూర్, జూలై 14: గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ఆర్కే7 గని కార్మికులను నట్టేట ముంచిందని సీఐటీయూ అధ్యక్ష, కార్యదర్శులు గుల్ల బాలాజీ, అంబాల శ్రీనివాస్ పేర్కొన్నారు. శ్రీరాంపూర్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. గని మూసివేత గుర్తింపుసంఘం వైఫల్యమేనని పేర్కొన్నారు. తమఏరియాలో గనులకు అనుమతులు ఉన్నాయా, లేవా అని తెలుసుకునే బాధ్యత ఆ యూనియన్ నాయకులకు లేదా అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చొరవచూపి అనుమతులు ఇప్పించి, గనిని తెరుచుకునేలా చేయాలని డిమాండ్ చేశారు. అనుమతులు తీసుకోకుండా నిర్లక్ష్యం వహించిన అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో తెలపాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు కస్తూరి చంద్రశేఖర్, వెంగళ శ్రీనివాస్, మెల్లం శ్రీధర్, శైల శ్రీనివాస్, శ్రీపతి బానేశ్ పాల్గొన్నారు.



ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలి: జీఎం

మందమర్రిరూరల్, జూలై 14: ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని, అప్పుడే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని ఏరియా జీఎం మనోహర్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని సారంగపల్లి గ్రామంలో సింగరేణి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సింగరేణి ప్రభావిత ప్రాంతాల ప్రజల ఆరోగ్యం కోసం సింగరేణి ఎంతో కృషి చేస్తుందన్నారు. వర్షాకాలంలో మంచినీటిని కాచివడబోసి తాగాలని, పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో కేకే1 గ్రూప ఏజెంటర్ రాందాస్, డీవైసీఎంవో డాక్టర్ ఉష, అధికారులు మైత్రేయబంధు, వెంకట్‌రెడ్డి, రవి, శ్రీనివాస్, డాక్టర్లు జయవాణి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

నూతన బొగ్గు గనుల సాధనకు కృషి

శ్రీరాంపూర్, జూలై 14: సింగరేణిలో నూతన బొగ్గు గనుల సాధనకు కృషి చేస్తామని ఏబీకేఎంఎస్(బీఎంఎస్) ప్రధానకార్యదర్శి సుధీర్ గురుడే అన్నారు. సింగరేణి కోల్‌మైన్స్ కార్మిక సంఘ్(బీఎంఎస్) 28వ ద్వైవార్షిక సమావేశం సీసీసీలోని ప్రైవేటు గార్డెన్స్‌లో జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. దేశవ్యాప్తంగా బొగ్గు గనులను కాపాడుతామన్నారు. అందులో పనిచేసే కార్మికుల హక్కుల సాధన, సంక్షేమానికి పాటుపడతామన్నారు. సమావేశంలో బీఎంఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి తూర్పు రాంరెడ్డి, సీఎంపీఎఫ్ సభ్యుడు ఆశిశ్‌మూర్తి, బీఎంఎస్ తెలంగాణ సంఘటన కార్యదర్శి రామ్మోహన్ రావు, ఏబీకేఎంఎస్ కార్యదర్శి మాధవనాయక్, కార్యవర్గ సభ్యుడు మంద రమాకాంత్, శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు నాతాడి శ్రీధర్ రెడ్డి, కార్యదర్శి కట్ట ఈశ్వరాచారి, సింగరేణిలోని 11ఏరియాలకు చెందిన 1000 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

బొగ్గు బ్లాకును సింగరేణికే ఇవ్వాలి

శ్రీరాంపూర్, జూలై 14: తెలంగాణలోని నాలుగు బొగ్గు బ్లాకులను సింగరేణికే ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి డిమాండ్ చేశారు. శ్రీరాంపూర్‌లోని కార్యాలయంలో ఆదివారం జిల్లాకమిటీ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, సింగరేణి అన్వేషించిన గనులను వేలం ద్వారా ఇతరులకు కేటాయించడం సరికాదన్నారు. దీనివల్ల ప్రైవేటీకరణ పెరుగుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ వేలంను వామపక్ష, సామాజిక సంఘాలు, లౌకికవాదులు, మేధావులు కలిసి కాపాడుకుందామని కోరారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె అశోక్, దాసరి రాజేశ్వర్, జిల్లా కమిటీ సభ్యులు బోడంకి చందు, దుంపల రంజిత్ కుమార్, గోమాస అశోక్, దాగం రాజారాం, తదితరులు పాల్గొన్నారు.

మైనింగ్ స్టాఫ్ సబ్ కమిటీ

శ్రీరాంపూర్, జూలై 14: ఎస్ఆర్పీ3,3ఏ గనిలో మైనింగ్‌స్టాఫ్ సబ్‌కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. పిట్ ఉపాధ్యక్షుడిగా బి మోహన్‌దాస్, పిట్‌కార్యదర్శిగా చిలుముల క్రాంతికుమార్, సహాయకార్యదర్శిగా ఎండీమోసిన్, షిఫ్ట్‌కార్యదర్శులుగా విష్ణు, ప్రభు, వంశీ, దిలీప్, కార్యవర్గ సభ్యులుగా సాయికుమార్, కళ్యాణ్, అభిలాష్, ప్రసాద్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షుడు బదావత్‌బాలకృష్ణ, కార్యదర్శిమారపల్లిబాబు, సంయుక్త కార్యదర్శి రాజశేఖర్, పిట్ కార్యదర్శి మురళీచౌదరీ పాల్గొన్నారు.

ఎస్‌సీఎంకేఎస్ కార్యవర్గం

శ్రీరాంపూర్, జూలై 14: సింగరేణికోల్‌మైన్స్ కార్మిక సంఘ్ (ఎస్‌సిఎంకెఎస్-బీఎంఎస్) కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా యాదగిరిసత్తయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అప్పాని శ్రీనివాస్, ప్రధానకార్యదర్శిగా యతిపతి సారంగపాణి, ఉప ప్రధానకార్యదర్శిగా వేణుగోపాల్‌రావు,చీఫ్‌ఆర్గనైజింగ్ కార్యదర్శిగా శ్రీరంగ పవన్‌కుమార్, కేంద్రఉపాధ్యక్షులుగా చాట్ల అశోక్, శ్రీనివాసరాజు, రామ్‌సింగ్, కేంద్ర కార్యదర్శులుగా రవీందర్, రమేష్, రాజేందర్, ప్రభాకర్, ఆర్గనైజింగ్‌కార్యదర్శులుగా వినయ్ కుమార్, శ్రీనివాస్, వీరన్న, తిరుపతి, కేంద్రకోశాధికారిగా ఆకుల హరిని ఎన్నుకున్నారు.

జిల్లా అభివృద్ధికి కేంద్ర నిధులు తీసుకువస్తా

- ఎంపీ గోడం నగేష్





ఆసిఫాబాద్‌లో ఎంపీ గోడం నగేష్‌ను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు, రెబ్బెనలో మాట్లాడుతున్న ఎంపీ

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 14: జిల్లా అభివృద్ధికి అవసరమైన కేంద్రనిధులు తీసుకువస్తానని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్ అన్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన సన్మాన సభకు ఆయన హాజరయ్యారు. ముందుగా జిల్లాకేంద్రంలోని జన్కాపూర్ రామాలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించి జిల్లాఅధ్యక్షుడు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు విశాల్, మాజీ జడ్పీటీసీ నాగేశ్వర్‌రావు, జిల్లా నాయకుడు కోట్నాక విజయ్‌కుమార్‌తో కలిసి జిల్లాకేంద్రంలోని ప్రధాన రహదారిగుండా భారీర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఒడ్డెపల్లిగార్డెన్‌లో ఏర్పాటుచేసిన సన్మానసభలో మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి కేంద్రం నిధులు తీసుకు వస్తామన్నారు. అంతకు ముందు నాయకులు మాట్లాడుతూ వివిధ సమస్యలు ఎంపీ దృష్టికి తీసుకురాగా వాటిపై స్పందిస్తూ గుండి బ్రిడ్జి నిర్మాణానికి, అడ ప్రాజెక్టు పూర్తి చేయడానికి అవసరమైన నిధుల కోసం కృషి చేస్తానని తెలిపారు. జిల్లాఆసుపత్రిలో వైద్యుల నియమకానికి చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో అగ్రికల్చర్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని కోరుతూ బీసీ యువజన సంఘం ఆధ్వర్యంలో ఎంపీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీఎంపీపీ మల్లికార్జున్, నాయకులు బోనగిరి సతీష్‌బాబు, మురళీ, ఎమ్మార్పీఎస్ నాయకుడు కేశవరావు, బీసీ సంఘం నాయకులు గజ్జెలలక్ష్మణ్, సాయికృష్ణ, ప్రశాంత్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

సమస్యలను దశల వారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తా

రెబ్బెన: రెబ్బెన మండలంలో నెలకొన్న సమస్యలను దశల వారీగా పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్ అన్నారు. ఆదివారం సాయంత్రం రెబ్బెన గోలేటిలో ఏర్పాటుచేసిన కృతజ్ఞత సభలో ఆయన మాట్లాడారు. తనపై ఎంతో నమ్మకం పెట్టి గెల్పించినందుకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటానని పేర్కొన్నారు. బీజేపీపై ఎంతో నమ్మకం పెట్టుకొని తన గెలుపునకు కృషి చేసిన ప్రతి కార్యకర్తకు తనవంతు సహాయసహకారం అందిస్తానన్నారు. రెబ్బెన, గోలేటిలోఉన్న కీలకసమస్యలను పరిష్కరించేందుకు ఏర్పాట్లు చేస్తామన్నారు. కేంద్రంలో ఉన్న పీఎం మోదీ చక్కటి సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టినట్టు వివరించారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించినట్టు వివరించారు. పెండింగ్ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. అందరికీ అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ బీజేపీని ఆదరించి ఎంపీ ఎన్నికల్లో ఓటేసిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ప్రజాధారణ చూడలేక ప్రతిపక్షాలు చేసిన తప్పుడు ఆరోపణలను ప్రజలు నమ్మలేదన్నారు. బీజేపీకి ఆదరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో బీజేపీ నాయకులు అరిగెల నాగేశ్వర్‌రావు, కేసరి అంజనేయులు గౌడ్, సొల్లు లక్ష్మి, సుగుణాకర్, ఓదెలుతో పాటు జిల్లా, మండలస్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. రెబ్బెన నుంచి గోలేటి వరకు నాయకులు, కార్యకర్తలు పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ప్లాస్టిక్ రహిత సమాజం కోసం కృషి చేయాలి



డ్యాన్స్‌లు చేస్తూ అవగాహన పరుస్తున్న యువకులు

కాగజ్‌నగర్, జూలై 14: ప్లాస్టిక్‌రహిత సమాజం కోసం కృషిచేయాలని బదలావ్ ప్రోగ్రాం సీఈఈ పానుహల్దర్ అన్నారు. ఆదివారం ఎస్పీఎం యాజమాన్యం ఆధ్వర్యంలో పట్టణంతోపాటు గ్రామాల్లో ప్లాస్టిక్ రహిత సమాజం కోసం అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్‌తో క్యాన్సర్ వ్యాధివస్తున్నట్టు తెలిపారు. అంతా అప్రమత్తంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి సుందరం, సిబ్బంది పాల్గొన్నారు.

వారబందీకి అనుగుణంగా నీటిని వినియోగించాలి

ఆసిపాబాద్ రూరల్, జూలై 14: వట్టివాగు ప్రాజెక్టుకింద సాగు చేసుకుంటున్న రైతులు వారబందికి అనుగుణంగా నీటిని వినియోగించుకోవాలని వట్టివాగు ఏఈ షేక్‌జానీ తెలిపారు. మొదటి దశలో ప్రతి సోమవారం ఉదయం 8నుంచి గురువారం 8 గంటల వరకు డి-3, డి-5, డి-6, డి-7, డి-8 డిస్ట్రిబ్యూటరీలకు సాగునీరు అందిస్తామన్నారు. రెండో దశలో గురువారం నుంచి సోమవారం వరకు డి-4, డి-9, డి-10, డి-11, డి-12 డిస్ట్రిబ్యూటరీలకు సాగునీరు అందిస్తామని తెలిపారు. రైతులు సాగునీటిని సరైన విధంగా వాడుకొని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయకట్టు స్థిరికరణకు తమకు సహకరించాలని కోరారు. అక్టోబరు 31 వరకు వారబంది కొనసాగుతుందని వివరించారు.

లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

వాంకిడి, జూలై 14: వాతావరణ శాఖాధికారుల సూచన మేరకు ఎగువప్రాంతాల్లో భారీవర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో కుమరంభీం అడ ప్రాజెక్టుకు భారీస్థాయిలో వరదనీరు వచ్చే అవకాశం ఉన్నందున అధికారులు నీటిని దిగువకు విడుదల చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. కాబట్టి కుమరం భీంప్రాజెక్టు దిగువ ప్రాంత గ్రామాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన వాంకిడి ఎస్సై సాగర్ తెలిపారు. ఆసిఫాబాద్ పెద్దవాగు, గుండి వాగుల్లోకి గ్రామప్రజలు, మత్స్యకారులు వెళ్లవద్దని హెచ్చరి కలు జారీచేశారు. అడ ప్రాజెక్టు గేట్లు ఏ క్షణంలోనైనా ఎత్తే అవకాశం ఉన్నందున దిగువన ఉన్న గ్రామాల ప్రజలు అప్ర మత్తంగా ఉండాలన్నారు.

ఉరి వేసుకొని విద్యార్థిని ఆత్మహత్య

కాగజ్‌నగర్, జూలై 14: ఇంటర్‌పరీక్షలో ఫెయిల్ అయినందుకు తీవ్రమనోవ్యధకు గురై కాగజ్‌నగర్ మండలం చింతగూడకు చెందిన విద్యార్థిని ఆడెకల్కిశ(17) శనివారం ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్టు ఏఎస్సై అనిల్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కాగజ్‌నగర్ మండలం చింతగూడలో నివాసం ఉంటున్న ఆడె కల్కిశ ఇంటర్ చదువుతోంది. సప్లిమెంటరీ పరీక్షల్లో ఫెయిల్ కావటంతో ఇంట్లోనే ఉంటోంది. తరుచూ ఫెయిలయ్యానని మానసికంగా బాధపడేది. ఈ క్రమంలో ఆదివారాం తీవ్ర మనస్తాపం చెందిన కల్కిశ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కల్కిశ తండ్రి మొండి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

9వ రోజుకు చేరిన అంగన్‌వాడీల సమ్మె

ఆసిఫాబాద్, జూలై 14: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీలు చేపడుతున్న సమ్మె ఆదివారం 9వ రోజుకు చేరింది. సోమవారం ఎమ్మెల్యే ఇంటి ఎదుట ధర్నా చేపడతామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సంఘం నాయకురాళ్లు గంగామణి, జంగుబాయి, తార, హీరాబాయి తదితరులు పాల్గొన్నారు.



దీక్షలో కూర్చున్న అంగన్‌వాడీ టీచర్లు